విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-బుట్టాయిగూడెం: అనేక సంవత్సరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణం, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపు కోరుతూ సీపీఐ అధ్వర్యంలో చేస్తున్న జీపు జాతా ఆది వారం బుట్టాయిగూడెం మండలంలోకి ప్రవేశించింది. రెడ్డి గణపవరం, పైడాకుల మామిడి పల్లకూరు, తూటి గుంట, తెల్ల దిబ్బలు, కోయిదా, తాలగొంది, నిర్వాసిత కాలనీలలో సీపీఐ బృందం నిర్వాసితులను స్వయంగా కలిసి సమస్యలు అడిగి కరపత్రాలు పంపిణీ చేసింది. ఏజెన్సీ మెట్ట ప్రాంతాలలో ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని సీపీఐ అనేకసార్లు పోరాటాలు, ముట్టడి కార్యక్రమాలు చేసినా ప్రభుత్వంలో చలనం లేదని కృష్ణచైతన్య విమర్శించారు. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి, నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తక్షణమే నిర్మించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. నిర్వాసితులను ప్రభుత్వాలు ఆదుకుని, అర్హత ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమ య్యాయన్నారు. పార్టీలకు అతీతంగా సీపీఐ నిర్వాసితుల పక్షాన నిలబడి నిరంతర పోరాటాలు చేస్తూ గిరిజనులకు అండగా నిలబడిందని ఆయన తెలిపారు. బహుళార్థక సాధక ప్రాజెక్ట్ అయిన పోలవరం పూర్తయితే వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ఉన్న వందల గ్రామాలకు సాగునీరుతో పాటు తాగునీరు, 960 మెగా వాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని ఆయన వివరించారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే పోలవరం ప్రాజెక్ట్ సత్వరమే నిర్మాణం జరగాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మా ణం విషయంలో జాప్యం చేస్తూ నిర్వాసితులకు నష్టపరి హారం చెల్లించడానికి నిధులు కేటాయించకుండా అన్యా యం చేస్తున్నారని విమర్శించారు. ముంపునకు గురవు తున్న ఏడు మండలాల నిర్వాసితుల జాబితాను తగ్గించి నష్ట పరిహారం చెల్లించకుండా కేంద్రం కుట్ర పన్నుతుందని ఆరోపించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. నిర్వాసిత కాలనీలో తాగునీరు, విద్యుత్ దీపాలు, సీసీ రోడ్లు, శ్మశాన వాటికలు, ఎర్త్ ఫిల్లింగ్ వంటి సమస్యలు పరిష్కారం కాక నిర్వాసితులు బిక్కుబిక్కుమంటూ తమ జీవితాలు గడుపుతు న్నారని చైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసిత మండ లాన్ని యూనిట్‌గా తీసుకొని అందరికీ ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ అందజేసి పునరావాస కేంద్రాలకు తరలించా లన్నారు. గ్రామాలను తరలించే నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు రూ.10 లక్షల ప్యాకేజీ అందజేయాలని డిమాండ్ చేశారు. జీపు జాతా కార్యక్రమంలో సీపీఐ దృష్టికి వచ్చిన సమస్యలను పాలక ప్రభుత్వాలు త్వరగా పరిష్కరించి వారిని ఆదుకోక పోతే భవిష్యత్తులో పోరాటాల ద్వారా ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈనెల 26న పోలవరంలో జరిగే బహిరంగ సభకు నిర్వాసితులందరూ తమ సమస్యల పరిష్కారం కోసం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి సోదెం వెంకటేశ్వరరావు, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య, జీలుగుమిల్లి మండల కార్యదర్శి కొప్పుల నాగరాజు, కుంజా బాలరాజు, మడకం దుర్గారావు పాల్గొన్నారు.

ఉంగుటూరువాసికి లాసెట్‌లో నాలుగో ర్యాంక్

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరుకు చెందిన అంబటి సత్యనారాయణ(సతీష్), మేలో నిర్వహించిన లాసెట్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఆయన నూజివీడు ట్రిపుల్‌లో బీటెక్ పూర్తి చేశారు. ఆయన తండ్రి సూర్యనారాయణ సామాన్య రైతు, తల్లి వెంకట రమణ గృహిణి. అంబటి సతీష్‌ను ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా కలెక్ట రేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో నేటి ఉద యం గం.10 నుంచి 'స్పందన' నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' సోమవారం ఉదయం గం.10 నుంచి యధావిధిగా నిర్వహించబడుతుందన్నారు.

యాసిడ్‌దాడి బాధితురాలికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-ఏలూరు: ఈనెల 13న ఏలూరులో ఫ్రాన్సిక అనే మహిళపై యాసిడ్ దాడి చేయడం ఆమెను మెరుగైన వైద్యం కోసం మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించారు. జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జేసీ బీ లావణ్య వేణి ఫ్రాన్సిక తల్లిదండ్రులకు రూ.1లక్ష చెక్కును అందజేశారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి, డీసీపీఓ సూర్య చక్రవేణి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ నిర్మల పాల్గొన్నారు.

భీమవరంలో భారీ అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర -భీమవరంటౌన్: భీమవరం మెంటేవారితోటలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఉంగరాల బాబు, ఐదేళ్ల క్రితం జయవర్ధన్ ఫర్నిచర్ షాప్ పేరుతో హోల్‌సేల్ అండ్ రిటైల్ ఫర్నిచర్ షాపు నిర్యహిస్తున్నారు. ఆదివారం ఉదయం ఒక్కసారిగా షాపు నుండి పొగతో కూడిన మంటలు రావడంతో చుట్టుపక్కల వారు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. వెంటనే తెరుకున్న స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అప్రమత్తమైన అగ్రిమాపక సిబ్బంది హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకుని అగ్నికీలాలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. ఇదే విషయాన్ని అగ్నిమాపక కేంద్ర జిల్లా అధికారి సిహెచ్.సూర్య ప్రకాశ రావుని వివరాలు అడగగా సమాచారం అందిన వెంటనే మా సిబ్బంది డి.డి.ఆర్.ఎఫ్.ఓ బి.శ్రీనివాస్, సిబ్బందితో కలిసి హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ సంఘటన జరిగి ఉంటుందని ప్రమాదంలో రూ.30 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అంచనా వేశామని, పూర్తి వివరాలు విచారణలో వెల్లడవుతాయి ఆయన తెలిపారు.

కష్టం వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలి

విశాలాంధ్ర-భీమవరం టౌన్: కష్టాలు, నష్టాలు వచ్చినప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మెంటే వారి తోటలో జరిగిన అగ్ని ప్రమాదం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఘటనా స్థలానికి చేరుకుని దగ్ధమైన ఫర్నిచర్ షాప్ ని పరిశీలించి జయవర్ధన్ ఫర్నిచర్ షాప్ యజమాని ఉంగరాల బాబు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కష్టాలు వచ్చినప్పుడు మనో ధైర్యంతో ముందుకు వెళ్లాలని, ఖచ్చితంగా ఇంతకు రెట్టింపు ఆ భగవంతుడు ఏదో ఒక రూపంలో మీ కుటుంబానికి మేలు చేస్తాడని, ధైర్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. కాగా బాబు కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వ్యక్తిగతంగా రూ.1లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. వార్డు ఇంచార్జ్ పాలవెల్లిమంగ, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, సమతం తాతాజీ, సుంకర చిన్న, మద్దాల రమణ, మద్దాల సత్యనారాయణ,అల్లూరి రామకృష్ణ చౌదరి, ముత్యాల అంజి, కోయ మని, శీలం రోహిత్, రామి శెట్టి జయ సూర్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన అధ్వర్యంలో తాగునీటి సరఫరా

విశాలాంధ్ర-నిడమర్రు: నిడమర్రు మండలం చానమిల్లి గ్రామ ప్రజలు తాగునీరు సమస్యతో ఇబ్బంది పడుతున్నారని ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పత్సమట్ల ధర్మరాజుకు జనసేన నాయకులు ఆదివారం తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు గౌతు వెంకన్న బాబు, యర్రంగి శేషు, రాజు పాల్గొన్నారు.

చంద్రబాబు నుంచే పవన్‌కు ప్రాణహాని

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: చంద్రబాబు నుంచే పవన్‌కు ప్రాణహాని ఉందని, జాగ్రత్తగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు ప్రాణహాని ఉంది సుపారీ గ్యాంగులు దింపారంటూ పవన్ కల్యాణ్ నోట ఆ మాట ఎందుకు వచ్చిందో గాని అలాంటిది ఏమైనా ఉంటే చంద్రబాబు నుంచే ఉంటుందన్నారు. వైసీపీ అధికారంలో ఉంది కాబట్టి పవన్‌కు ఏమైనా జరిగితే దానిని అధికార పార్టీ మీదకు నెట్టి రాజకీయ లబ్ధి పొందాలని టీడీపీ అధినేత చంద్రబాబు కుట్ర పన్నే అవకాశం ఉందని మంత్రి ఆరోపించారు. వ్యతిరేక ఓటు చీలకూడదు అని ప్రతిపక్షాలన్నీ కలిసి పోటీ చేయాలని చెప్పే నువ్వు, రేపు ఎన్నికల్లో సీఎం అభ్యర్థిగా నిన్ను చంద్రబాబు ప్రకటిస్తాడా అని మంత్రి పవన్‌ను ప్రశ్నించారు. 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు తన పరిపాలన చూసి ఓటు వేయాలని అడిగే దమ్ము ధైర్యం లేదన్నారు. పవన్ కల్యాణ్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదని స్థిరత్వం లేకుండా మతితప్పినట్లు మాట్లాడితే ప్రజలు ఛీ కొడతారన్నారు. వైసీపీ నేతలు ముప్పిడి సంపత్ కుమార్, కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.

నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: కరెంటు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యుత్ నిరాటంకంగా సరఫరా చేయాలని టిడిపి మండల అధ్యక్షులు పారేపల్లి నరేష్ డిమాండ్ చేశారు. బయ్యనగూడెం గ్రామంలో ఆయన నివాసం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తీవ్ర ఎండల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని, ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయుటలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని నరేష్ విమర్శించారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడం వల్ల వ్యాపారస్తులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వేసవికాలం వచ్చేముందే ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి అధికారులతో మాట్లాడి వేసవి తీవ్రత దృష్ట్యా ఎంత విద్యుత్ అవసరం అవుతుందో సమీక్షించి ముందస్తు ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం కేవలం కేసులు పెడతానికి తప్ప ప్రజా సమస్యల పరిష్కారం పట్టవని ఆరోపించారు.

పంచాయితీ పేరుతో ఆటవిక చర్య

విశాలాంధ్ర-చాట్రాయి: పంచాయితీ పేరుతో ఆటవికంగా పాశవికంగా ప్రవర్తించడం వల్ల నిండు ప్రాణం పోయిందని నూజివీడు నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇటీవల పంచాయితీలో జరిగిన అవమానంతో ఆత్మహత్య చేసుకున్న కలవల శ్రీను కుటుంబ సభ్యులను వారు ఆదివారం పరామర్శించారు. ఘటన చాలా దుర్మార్గమైనది అన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని తాము చేయగలిగినంత సహాయం చేస్తామని ధైర్యం చెప్పారు. నూజివీడు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు దోసపాటి రాము, కార్యదర్శి మానేపల్లి వెంకట సతీష్ కుమార్, వాసవి క్లబ్ రీజినల్ సెక్రటరీ రాచమడుగు నారాయణ, సుష్మాను జిల్లా నాయకులు చిన్నం శ్రీనివాసరావు, వాసవి క్లబ్ నూజివీడు కోశాధికారి చిట్టూరి కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

వామ్మో.... గుండె గు'బిల్లు'

విశాలాంధ్ర-చాట్రాయి: రెండు ఫ్యాన్లు, రెండు లైట్లు 70యూనిట్ల మీటరు రీడింగ్‌కు రూ. 17, 350/- బిల్లా? అంటూ టీడీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం చాట్రాయి మండలం కొత్త గూడెం గ్రామంలో తెలుగు దేశం భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తుండగా ఒక ఇంటి దగ్గర కరెంట్ బిల్లు చూపించడంతో అందరూ కంగుతిన్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ముద్దరబోయిన ఫోన్ చేసి ప్రశ్నల వర్షం కురిపించారు. తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండలం పార్టీ అధ్యక్షులు మరిడి చిట్టిబాబు, మాజీ సర్పంచ్ చల్లగుళ్ళ రాజారత్నం, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'బోగా' ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: సీపీఐ సీనియర్ కార్యకర్త, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఏఐవైఎఫ్ నాయకులు బోగా ఉమామహేశ్వరరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఏలూరు నగరంలో సీపీఐ, ప్రజానాట్యమండలి, యువజన సమాఖ్యలను నిర్మాణం చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక 36వ డివిజన్ భగత్ సింగ్ స్మారక గ్రంథాలయం వద్ద బోగా ఉమామహేశ్వరరావు 14వ వర్ధంతి కార్యక్రమం 36 డివిజన్ సీపీఐ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ శాఖ కార్యదర్శి కడుపు కన్నయ్య అధ్యక్షత వహించారు. ఉమామహేశ్వరరావు చిత్రపటానికి కన్నయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. బండి వెంకటేశ్వరరావు కడుపు కన్నయ్య, బోడెం వెంకటరావు మాట్లాడుతూ ఉమామహేశ్వరరావు ఆశయాలను కొనసాగిస్తామని, 36 డివిజన్ లో సిపిఐని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏఐటీయుసి జిల్లా నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే, సీపీఐ నాయకులు గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వర్లు, చింతల సూర్యనారాయణ, బట్టా మాణిక్యాలరావు, పోలా భాస్కర్, ఆర్ పెద్దిరాజు, బేతా శంకర్, సిహెచ్ సుబ్రమణ్యం, యర్రా నాగేశ్వరరావు, సిపిఐ అభిమానులు తీడా సత్యనారాయణ, అల్లంకి వేణు, జీవీ రమణ, కుమార్, దుర్గారావు, మహేశ్వరరావు సతీమణి, ఉమా తనయుడు బోగా రాజేష్ తదితరులు పాల్గొని బోగా మహేశ్వరరావుకు ఘనంగా నివాళులర్పించారు.

నిబంధనలు తప్పనిసరి: ఎంఈఓ

విశాలాంధ్ర-కైకలూరు: ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చెయ్యాలని పుస్తకాలు అమ్మిన బట్టల అమ్మిన తక్షణం ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని కైకలూరు మండల విద్యాశాఖ అధికారి డి.రామారావు అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అనుమతులు నిమిత్తం దరఖాస్తు చేసుకున్న సమయంలో లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫీజులు మాత్రమే తీసుకోవాలని పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు మాత్రమే బోధించాలని నోటి పుస్తకాలు తల్లిదండ్రులు వారికి ఇష్టం వచ్చిన దుకాణాలలో కొనుగోలు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించాలని టెక్స్ట్ బుక్స్ వంటి ఎమ్మార్పీ లేకుండా అమ్మకాలు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చాయని నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా పాల్పడితే తక్షణం ఆ పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామని ఆయన తెలిపారు.ఇప్పటికే జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు ప్రకారం తల్లిదండ్రుల నుండి నిబంధనలు అతిక్రమించినట్టు ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు.కొంత మంది జిల్లా కలెక్టర్ కి ప్రైవేట్ పాఠశాలలపై ఫిర్యాదు చేశారని దీనిపై చర్యలు నిమిత్తం జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక సమర్పించినట్టు ఆయన తెలిపారు.ఎవరైనా తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలు విరుద్ధంగా అధిక ధరలకు అమ్మితే కైకలూరు విద్యాశాఖ కార్యాలయానికి తెలియచేయాలని ఆయన అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో శిక్షణ పొందిన సిబ్బందితో విద్యాభ్యాసం చేస్తున్నామని తల్లిదం డ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన తెలిపారు.

సినీ, నాటక రంగ కళాకారుడు గరగ మృతి

విశాలాంధ్ర-భీమవరం: సినీ నాటక రంగ ప్రజా కళాకారుడు గరగ సూర్యనారాయణ (85) శనివారం వృద్ధాప్యంతో భీమవరంలో మృతి చెందారు. సూర్యనారాయణ పూర్వకాలం నుండి ఎన్నో నాటకాలు నాటికలు పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. సినీరంగంలో డాక్టర్ గరికిపాటి రాజారావు, మిక్కిలినేని, వల్లం నరసింహారావు, అల్లు రామలింగయ్య సహసర ప్రజా కళాకారులతో మిత్రులతో ప్రజలను చైతన్యవంతం చేసే ఎన్నో సినిమాల్లో నటించారు. స్వగ్రామ భీమవరం అయినప్పటికీ ఎక్కువ కాలం మద్రాసు హైదరాబాదులో ఉంటూ ఎన్నో సినిమాల్లో నటించారు. తర్వాత వయసు రీత్యా భీమవరం చేరి స్థానిక కళాకారులతో కలిసి ఉంటూ ఎన్నో సూచనలు చేసేవారు. ప్రజా కళాకారుడిగా సినీ రంగంలో తన అనుభవాలను ఎప్పుడూ ప్రజానాట్యమండలి కళాకారులకు వివరించేవారు. దర్శకుడు ముత్యాల సుబ్బయ్యకు ఎంతో ఇష్టమైన వ్యక్తి సూర్యనారాయణ. ఈయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమల్లి తరపున జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, కళారంజని వ్యవస్థాపక అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్, ఫోకస్ వ్యవస్థాపక అధ్యక్షులు గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, భీమవరం కళాపరిషత్ అధ్యక్షులు తిరుమల కామేశ్వరరావు, గురజాడ కళానికేతన్ అధ్యక్షులు మామిడిపల్లి సత్యనారాయణ, కార్యదర్శి చుక్కనశ్రీ, మావుళ్ళమ్మ సూర్యోదయ నాట్యమండలి అధ్యక్షులు పులగం శివ నాగ నరసింహారావు, ప్రజా నాట్య మండలి కళాకారులు ఉగాది, చాంద్ బాషా, బొండాడ లక్ష్మి, తిరుమని కామేశ్వరరావు, తిరుమాని చంటి రాజు, ఏ.నాగేశ్వరరావు, సిహెచ్. వి.సుబ్బారావు, సిహెచ్ నాగేశ్వరరావు, కాటి వెంకటరత్నం, కదలి నాగేశ్వరరావు, గంగాధరం చౌదరి తదితరులు సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జగన్ నీరో చక్రవర్తి

విశాలాంధ్ర-ఏలూరు: కిడ్నాప్‌లు, హత్యలు, దోపిడీలు దౌర్జన్యాలతో రాష్ట్రం అతలాకుతలం అవుతున్నా సీఎం జగన్ నీరో చక్రవర్తి మాదిరిగా స్పందించకపోవడం దారుణమని టీడీపీ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి బడేటి చంటి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బాపట్ల జిల్లా, చెరుకుపల్లి మండలం, రాజోలులో ఉప్పాల అమర్నాథ్ అనే బాలుడిని పెట్రోల్ పోసి తగలపెట్టడాన్ని నిరసిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని చంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ వర్గీయులపై విపరీతంగా దాడులు జరుగుతున్నాయని చెప్పడా నికి ఉప్పాల అమర్నాథ్ పాశవిక హత్యే నిదర్శనమన్నారు. ఊప్పాల జగదీష్ బాబు, చోడే వెంకటరత్నం, దాసరి ఆంజనే యులు, జాలా బాలాజీ,మారం హనుమంతరావు,అర్ ఎన్ ఆర్ నాగేశ్వరరావు, రాజేశ్వరరావు, రెడ్డి నాగరాజు, వీరంకి త్రినాథ్, రాజా మురళి, జూట్ మిల్ శ్రీను, పిల్లారిశెట్టి సంధ్య సురేష్, గొంగడి బోసు, జాగాని సంతోషి, రేవులగడ్డ లాల, కోన మాణిక్యం, ఆకుల ప్రసాద్, సిరి శెట్టి నారాయణ ప్రసాద్, అన్నవరపు సతీష్, కాళ్ల శ్రీదేవి, శెట్టి సరిత, వేల్పుల అరుణ, చోడే బాలు, మేడపల్లి ఏసు, గవ్వ నాగేశ్వర రావు, ఎలబాక బాలకృష్ణ పాల్గొన్నారు.

ఏరువాక సాగేనా ?

విశాలాంధ్ర-లింగపాలెం: ఏరువాక ఈ ఏడాది అనుకూలంగా ఉంటుందా.. ఉండదా.. రైతుల్లో నెలకొన్న అనుమానాలు ఎన్నో జూన్ నెల సగం దాటినా వరుణిడి జాడ లేకపోవటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రెండు దశాబ్దాలలో ఇటువంటి పరిస్థితి చూడలేదని ప్రజలు అంటున్నారు. మే నెలలో వేసిన ఎండలను మించి జూన్‌లో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నాయి. తొలకరి జల్లులు ఇప్పటివరకు పడలేదు. వాతావరణ పరిస్థితులు పరిశీలిస్తే తొలకరి జాడే దరిదాపుల్లో లేదని పరిశీలకులు అంటున్నారు. ఇప్పటికే నార్లు కోసం విత్తనాలు చల్లాల్సి ఉంది. కాని కనీసం బోరులు ఆధారంగా కూడా నార్లు కోసం విత్తనాలు చల్లటంలేదు. ఎండలు అధికంగా ఉండటం వల్ల బోర్లు ఆధారంతో విత్తనాలు చల్లినా సరైన ఫలితం ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చింతలపూడి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి.నరసాపురం మండలాల్లో ఖరీఫ్‌లో దాదాపు 33 వేల ఎకరాలలో వరి పంట వేస్తారు. ఖరీఫ్‌లో వేసే వరి పంటను వర్షాధారంతోనే 60 శాతం వరకు పండిస్తారు. మిగిలిన 40 శాతం బోరుల ఆధారంతో పండిస్తారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం వల్ల ఈ డివిజన్ పరిధిలో దాదాపు ఏడు అడుగులు మేర భూగర్భ జలాలు అడుక్కి వెళ్ళాయని అధికారులు తెలిపారు. ఎండలు ఇలాగే కొనసాగితే మరింతగా భూగర్భ జలాలు అడుగంటుతాయనే ఆందోళన చెందుతున్నారు. వరి పంట వేయాలంటూ 1500 ఎకరాలలో నాట్లు వేయాలి. ఇప్పటికి కనీసం 50 ఎకరాలలో కూడా విత్తనాలు చల్లలేదు. తొలకరి వర్షాలు పడితే దుక్కుతున్నుకుంటారు. ఈ ఏడాది దుక్కులు దున్నటానికి వీలు లేకుండా ఉందని ఆవేదనతో ఉన్నారు. నారులు సిద్ధం కావాలంటే 30 రోజుల సమయం పడుతుంది. సకాలంలో నారులు సిద్ధమైతేనే నాట్లు పడతాయి. సకాలంలో నాట్లు వేయకపోతే దిగుబడులు ఆశాజనకంగా ఉండవని రైతులు ఆందోళనతో ఉన్నారు.

సినిమాలో నటిస్తున్న తెలుగు మాస్టారు

విశాలాంధ్ర-లింగపాలెం: తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న లక్కపాం ప్రకాశరావు సినిమా యాక్టరయ్యారు. టిసిహెచ్ఆర్ పాలెంకు చెందిన ఈయన ఎంఎ., బీఈడీ చేసి ధర్మాజీగూడెం హైస్కూలులో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్నారు. ఈ స్కూలులో కాలేజీని ఏర్పాటు చేయటంతో ఈ కాలేజీకి తెలుగు పండిట్ లెక్చరర్‌గా ప్రమోషన్‌పై ఈ ఏడాది నియమించారు. ఈయనకు కళపై అభిరుచి, కవిత్వంపై ఆసక్తి ఉండటంతో నాటకాలు, నాటికలు, నవలలు పదికి పైగా రచించారు. ఈయన రాసిన రచనలలో బాలల్లో విజ్ఞానాన్ని పెంచేలా తెలుగు సాహిత్యాన్ని ప్రతిబింబించేలా ఉంటాయి. ఈయనలో ఉన్న కళాత్మకతను గుర్తించి రాజా రవీంద్రతో హీరోగా తీస్తున్న శ్రీవీర ప్రతాప్ 1940 సినిమాకు కీలకమైన రైతు క్యారెక్టర్ పాత్రకు ఎంపిక చేయటంతో ఈ పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ ఏడాది సెప్టెంబరులో సినిమా విడుదలకు సిద్ధం చేస్తున్నారు.